క్లుప్తంగా

వాకర్స్ గ్రూప్ సభ్యుల వితరణ

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు వాకర్స్ గ్రూపు సభ్యులు రూ.21.500 ఆర్థిక సాయాన్ని అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబును శనివారం కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు. వేకువ జామున, సాయంత్రం వేళలో మైదానంలో వాకింగ్, వ్యాయామం చేసేందుకు వచ్చే వారు చీకటిలో ఇబ్బంది పడకుండా ఉండేలా సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కణపాక చౌదరినాయుడు, కొరికాన గంగునాయుడు, చంద్రమౌళి, సూర్యనారాయణ, తదితరులున్నారు.

కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు


వల్లరగుడబలో పర్యటిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని వల్లరగుడబలో శనివారం సాయంత్రం పర్యటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని రాజకీయ నాయకుల విగ్రహలకు ముసుగులు వేశారా లేదా,పోస్టర్లు, బ్యానర్లు తొలగించారా లేదా అని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి


వాగపాగు పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు రోజువారీ భోజనం అందించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని వాటపాగు, ఎల్.ఎల్.పురం గ్రామాల్లో గల పాఠశాలలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి విద్యార్థులకు పశు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి విద్యా ప్రమాణాలు తెలుసుకున్నారు. పాఠశాలల పరిసరాలు, విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమన్వయంతో బోధన అందించాలని సూచించారు.

సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్


కవాతు చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. ఈ క్రమంలో సాయుధ బలగాలతో గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. మండలంలోని ఎల్ఎల్.పురం, భాసూరు, వీపీ.రాజుపేట తదితర గ్రామాల్లో శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు, యువత చైతన్యవంతులై ప్రవర్తించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించాలని, హద్దులు మీరితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

లక్ష్యాలు అధిగమించాలి


మాట్లాడుతున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యాలను అధిగమించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర అన్నారు. గుమ్మ లక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయంలో సేల్స్‌మేన్లు, డీలర్లు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు నాణ్యమైన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని, సమయ పాలన పాటించాలని, ఎన్నికల నిబంధనల మేరకు విధులు ఇర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో బీఎం కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, గొడాం ఇన్‌ఛార్జ్ ఎం.సాంబశివరావు తదితరులు ఉన్నారు.



అధ్వానంగా ఉన్న ధూళికుప్ప గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి



రూ.1.50 కోట్లతో ధూళిపేట గ్రామానికి నిర్మించిన బీటీరోడ్డు (నేడు)

ప్రగతి బాటలు

కురుపాం/పాలకొండ/భామిని: గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధి, మరమ్మతులను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రధాన రహదారులను అనుసంధానిస్తూ బీటీ రోడ్లు నిర్మించారు. రహదారుల నిర్మాణంతో గిరిజన గ్రామాల్లో ప్రజలకు విద్య, వైద్య, రావాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.


కొత్తగా నిర్మాణం పూర్తి చేసిన ఏరియా ఆసుపత్రి రహదారి

- కురుపాం మండలంలో ఉదయపురం పంచాయతీ ధూళికుప్ప గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో మెండెంఖల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ధూళికుప్ప గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు.
- డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి పరిసర మండలాల నుంచి నిత్యం అనేక మంది రోగులు వస్తుంటారు. సరైన రహదారి లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లేందుకు నరక యాతన అనుభవించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.40 లక్షలతో సీతంపేట రోడ్డు నుంచి రామాకళామందిర్ వరకు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ మార్గంలోనే ఆస్పత్రి ఉండటంతో రోగులకు ప్రయాణ కష్టాలు తప్పాయి.

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు గోతులతో నిండిపోయి నరకానికి నకలుగా మారింది. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకునేవి. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గత టీడీపీ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో మరమ్మతు పనులు చేపట్టారు. రూ.3.47 కోట్లతో లివిరి నుంచి బిల్లుమడ వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మించారు. దీంతో డైవర్షన్ రహదారిలో ప్రయాణ కష్టాలు తీరాయని ప్రయాణికులు అంటున్నారు.



పసుకుడి వంతెన డైవర్షన్ వద్ద వేసిన తారురోడ్డు



గుంతలతో నిండిన డైవర్షన్ రోడ్డు

వైద్యుడికి సన్మానం


డా.సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న డా.రామ్మోహనరావు, తదితరులు

గరుగుబిల్లి: హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా పనిచేస్తున్న రావుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్‌ను శనివారం గ్రామస్తులు, వైద్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వగ్రామంలో వైద్య సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన పట్ల ఎంతో ఆప్యాయత చూపించిన గ్రామస్తులకు, వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులకు అయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.రామ్మోహనరావు, మాజీ సర్పంచ్ జి. కాశీనాయుడు, మాజీ ఎంపీటీసీ జి.అన్నపూర్ణమ్మ, సీనియర్ నాయకుడు కె.శివున్నాయుడు, బొబ్బిలి ఏరియా ఆస్పత్రి సవిల్ సర్జన్ జి.రామ్‌నరేష్, జి.హరికుమార్, జి.శంకరరావు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి దర్శనానికి శనివారం భక్తులుపోటెత్తారు. ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతానగరం: మండలంలోని పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో హెవీ పవర్‌లైన్, ఎల్టీ లైన్‌లకు నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ జగన్ మోహనరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ, పనులు పూర్తయిన తర్వాత సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

భగత్‌సింగ్ నిజమైన హీరో

పార్వతీపురం టౌన్: భగత్‌సింగ్ నిజమైన హీరో అని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. ఎస్ఎఫ్ఐ పార్వతీపురం కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ సంపదను దోచుకుపోతున్న బ్రిటిష్ పాలకులను ఎదురించి, చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించిన ధీరులని కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంతమొందించాలనే భగత్‌సింగ్ పిలుపు ప్రమాదకరమని భావించిన బ్రిటిష్ పాలకులు కోర్టు విధించిన శిక్షకు ఒకరోజు ముందునే చీకటి గదిలో ఉరి శిక్షకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవకారునికి నీరాజనాలు..

బలిజిపేట: పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, తదితరులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగత్‌సింగ్ ఇచ్చిన ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం దేవ నలుమూలలా వ్యాపించి యువతను ఉత్తేజపరిచిందన్నారు. కార్యక్రమంలో కె.మురళి, బి.శ్రీను, కె.గౌరీనాథ్, వి.శివుడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ


వీరఘట్టం: మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్


పాలకొండ రూరల్: ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఏపీఓలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ వరహాలు ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్, మార్కుడు కాపీ వాడకంపై శిక్షణ అందించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు చూడాలన్నారు. నోడల్ అధికారి ఎస్.రామకృష్ణ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించే బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పీఓలు, ఏపీఓలకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఈవీఎంలను ముందుగానే చెక్ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, ఆర్ఐ లక్ష్మంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అమలు చేయాలి


భాసూరులో ఎన్నికల కోడ్ అమలుపై సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలయ్యేలా ప్రజలు సహకరించాలని నోడల్ అధికారి ఎస్.రామకృష్ణ కోరారు. మండలంలోని అట్టలి, భాసూరు తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఎన్నికల నిబంధనలపై స్థానిక యువతకు అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, గోడలపై రాతలు ఉండకూడదన్నారు. పార్టీలను అపాదించే రంగులు వేయకూడదని తెలిపారు. గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలను, ఓటర్లను చైతన్యపర్చాలన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి అధికారులు విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

విజయం వరించాలని ప్రార్థిస్తూ..


వండవ షిర్డీసాయి మందిరంలో హోమ గుండం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు విజయాన్ని అందించాలని కోరుతూ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రార్థించారు. నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వండవలోని కాశీవిశ్వేశ్వస్వామి ఆలయంలో, షిర్డీసాయి ధ్యాన మందిరంలో హోమ గుండం వద్ద పూజలు చేశారు. మందిరంలో ఏర్పాటు చేసిన శివలింగానికి అభిషేకాలు చేశారు. అలాగే పాలకొండ కోటదుర్గమ్మను, సీతంపేటలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు దేవతామూర్తుల ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు ఆమెకు అందించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కామేశ్వరి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలో రావుపల్లిలోని పెద్దవీధిలో సీతారామ మందిర పునఃప్రతిష్ట పూజలను రెండో రోజు శనివారం నిర్వహించారు. గ్రామ పురోహితులు బంకుపల్లి కృష్ణమూర్తి శర్మ, సూర్యనారాయణ శర్మ పర్యవేక్షణలో మండపార్చన, కుంకుమ అర్చనలు, గోపూజ, సూర్యనమాస్కారాలు తదితర పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదివారం పునఃప్రతిష్ట పూజా కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

- ప్రగతి పథంలో ఘనసర
- రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.40 కోట్లతో సంక్షేమ లబ్ధి
- మౌలిక వసతులతో మారిన గ్రామ రూపురేఖలు

అభివృద్ధిలో ఘనం

భామిని: టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఘనసర గ్రామం నేడు అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు స్వప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చి గ్రామాభివృద్ధిని గాలికొదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సర్పంచ్ కిల్లారి కమల ఎమ్మెల్యే సహకారంతో పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించారు. సుమారు రూ.6 కోట్లతో ప్రజలకు అవసరమైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. అర్హత ఉన్న ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో మొత్తం రూ.17,22,00,268లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. పరోక్ష నగదు బదిలీ (నాన్ డీబీటీ) విధానంలో మరో రూ.40,08,20,702లు లబ్ధి చేకూరింది.

చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.26.23 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మాణం.
- రూ.17.26 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం.
- నాడు-నేడు పథకం క్రింద రూ.26.97 లక్షలతో ఘనసర ఎంపీయూపీ స్కూల్‌లో అధునాతన వసతుల ఏర్పాటు.
- రూ.42 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మాణం చేపడుతున్నారు.
- రూ.10 లక్షలతో 8 మినీ రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం, తాగునీటి కుళాయిల ఏర్పాటు.
- రూ.8 లక్షల వ్యయంతో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం.
- వైఎస్సార్ జలసిరి పథకం ద్వారా వ్యవసాయ బోర్లు ఏర్పాటుతో పచ్చని పంటలతో గ్రామం అలరారుతోంది.
- రెండు అంగన్‌వాడీ భవనాలు నిర్మించి పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందిస్తున్నారు.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతుభరోసా కేంద్రం


యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనం


నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన ఎంపీయూపీ పాఠశాల భవనం


గ్రామంలోని ఓ వీధిలో నిర్మించిన సీసీరోడ్డు


రక్షిత మంచినీటి పథకం ట్యాంక్

పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి(నగదు)
జగనన్న అమ్మఒడి	431	రూ.1,93,91,758
జగనన్న విద్యాదీవెన	364	రూ.1,05,65,106
జగనన్న వసతిదీవెన	259	రూ.38,40,317
వైఎస్సార్ రైతుభరోసా	729	రూ.3,36,95,400
వైఎస్సార్ పంటల బీమా	4	రూ.2,15,868
వైఎస్సార్ సున్నావడ్డీ(రైతులు)	268	రూ.7,37,494
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	2	రూ.41,700
వైఎస్సార్ పింఛన్ కానుక	693	రూ.6,94,23,250
వైఎస్సార్ చేయూత	347	రూ.1,50,93,750
వైఎస్సార్ సున్నావడ్డీ(మహిళలు)	891	రూ.7,36,144
వైఎస్సార్ కాపు నేస్తం	2	రూ.75,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	135	రూ.40,07,754
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	77	రూ.4,2,825
హౌసింగ్ (నేరుగా చెల్లింపులు)	15	రూ.5,33,242
వైఎస్సార్ బీమా	12	రూ.21,80,000
వైఎస్సార్ వాహన మిత్ర	18	రూ.5,80,000
జగనన్న చేదోడు	13	రూ.2,70,000
కోవిడ్ సహాయం(వైట్ కార్డ్ హోల్డర్స్)	1,078	రూ.10,78,000
జగనన్న తోడు(వడ్డీ)	65	రూ.31,891

రూపురేఖలు మారిపోయాయి



ఘనసర గతంలో అభివృద్ధికి దూరంగా ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సీసీరోడ్లు, కాలువలు, రక్షిత మంచినీటి పథకాలు నిర్మించాం. గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం ఏర్పాటుతో ప్రభుత్వ సేవలన్నీ ఇంటి వద్దే అందుతున్నాయి.

– కిల్లారి కమల, సర్పంచ్, ఘనసర

జగనన్న మేలు మరిచిపోలేం



జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికీ అందాయి. మహిళల పేరుతో పథకాలు అందివ్వడం వల్ల మహిళలకు గౌరవం పెరిగింది. మా కుటుంబానికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు, తదితర పథకాలు అందాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డాం. స్వయం ఉపాధితో ముందుకు నడుస్తున్నాం. జగనన్న మేలు మరిచిపోలేం.

– బలివాడ లక్ష్మి, మహిళా సంఘ అధ్యక్షురాలు, ఘనసర

వ్యవసాయానికి మంచి రోజులు



జగనన్న ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ రంగానికి మంచి గుర్తింపు వచ్చింది. వైఎస్సార్ రైతుభరోసాతో పెట్టుబడి సాయం అందించడంతో అప్పుల బాధ తప్పింది. సంతోషంగా పంటలు సాగు చేస్తున్నాం. పంట రుణాలు, సున్నావడ్డీ సాయం అందింది. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయి.

– కిల్లారి ఫాల్గుణరావు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి, ఘనసర